దారంతా గుంతలే!







సంక్రాంతిలోపు రహదారులను తలతలా మెరిసేలా చేస్తామని, గుంతలు లేకుండా పూడ్చుతామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు. కర్నూలు నగరంలోని 19వ వార్డు జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. రహదారిలో దారిని వెతుక్కొని ప్రయాణికులు వెళ్లాల్సి వస్తోంది. ఈ రహదారి వెంబడి ఇందిరమ్మ కాలనీ, బీడీ కాలనీ కార్మికుల నివాసాలు ఉండడంతో అటువైపు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది.

–కర్నూలు (సెంట్రల్)



గుంతలమయంగా మారిన జొహరాపురం - వెంకాయపల్లె రహదారి

క్లుప్తంగా

రైతు నాయకుడి ప్రాణాలు కాపాడండి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఢిల్లీలో రైతు సమస్యల పరిష్కారం నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాలే ప్రాణాలు కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం జగ్జీత్‌సింగ్ దలేవాలే దీక్షకు మద్దతుగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర చట్టం చేయాలన్నారు. 45 రోజులుగా రాజధాని సరిహద్దుల్లో చేస్తున్న దీక్షలను విరమింపజేసి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. నాయకులు డి.శ్రీనివాసరావు, మల్లికార్జున, బాబయ్య, రబియా, మధు, నాగరాజు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో చోటుపై హర్షం



సురేష్‌కుమార్, రవికుమార్

కర్నూలు సిటీ: కాకినాడలో జరిగిన యూటీఎఫ్ 17వ విద్యా వైజ్ఞానిక మహాసభల్లో నూతనంగా ఎన్నుకున్న రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించడంపై ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ పాటి, జి.హేమంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన యూటీఎఫ్ సీనియర్ నాయకులు కె.సురేష్ కుమార్ ఐక్య ఉపాధ్యాయుల పత్రిక ప్రధాన సంపాదకులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అదేవిధంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్న యూఆర్‌పి రవికుమార్ యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్‌గా ఎంపికయ్యారని వెల్లడించారు.

డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



రాజీవ్‌నగర్‌లో మురుగు సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో వివిధ కాలనీలలో దెబ్బతిన్న డ్రైనేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన బుధవారం సాయంత్రం స్థానిక బళ్లారి చౌరస్తా బస్ షెల్టర్ పనులు, ఇందిరాగాంధీ నగర్ కమ్యూనిటీ హాలు పనులను, అశోక్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో దెబ్బతిన్న డ్రైనేజీలను పరిశీలించారు. ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, కార్పొరేటర్ మునెమ్మ, డీఈఈ గంగాధర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అంజాద్‌బాషా ఉన్నారు.

థీమాటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఆకట్టుకుంటున్న కొండపల్లి బొమ్మలు

కర్నూలు(అగ్రికల్చర్): లేపాక్షి థీమాటిక్ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాలు ఉత్పత్తులు కనువిందు చేస్తున్నాయి. కర్నూలు కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ప్రాంగణంలో థీమాటిక్ ఎగ్జిబిషన్‌ను మేనేజర్ తిమ్మయ్య ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ 12వ తేదీ వరకు కొనసాగనుంది. హస్తకళల ఉత్పత్తులైన కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేస్ అల్లికలు, టెర్రకోట మట్టి కుండలు, లెదర్ లాంప్ షేడ్స్ తదితర వస్తువులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం మేనేజర్ మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో ఉత్పత్తి ధరకే వస్తువులు లభిస్తాయని పేర్కొన్నారు. కర్నూలు నగరంతో పాటు జిల్లా ప్రజలు హస్తకళల ఉత్పత్తులను ఆదరించాలని కోరారు. మిగిలిన వస్తువులు లేపాక్షి ఎంపోరియంలో హ్యాండీ క్రాఫ్ట్స్ వస్తువులపై 15 శాతం, హ్యాండ్‌లూమ్స్‌పై 10 శాతం డిస్కౌంట్ లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

కర్నూలు (హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈనెల 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు ఈనెల 6వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్‌ను వాయిదా వేస్తూ 9న మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 16వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ప్రభుత్వమే 108ను నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని ఆ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 108 ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరసింహ, రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, ట్రెజరర్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌దేశాయ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమ్మెకు వెళ్లే ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించే ప్రయత్నం చేసిందన్నారు. ఉద్యోగులందరూ ఐకమత్యంతో పోరాడి జీతాలు పెంచుకోవడానికి చూడాలన్నారు. ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.4 వేలు పెంచాలన్నారు. 108 వ్యవస్థను బలోపేతం చేస్తే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఆపద సమయంలో వైద్యసేవలు అంది ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు.

త్వరలో వీధికుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు



శస్త్ర చికిత్సల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాతీయ జంతు సంక్షేమ మండలి సభ్యురాలు అంజలి గోపాలన్

కర్నూలు (టౌన్): వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని భారత జంతు సంక్షేమ మండలి సభ్యురాలు అంజలి గోపాలన్ సూచించారు. బుధవారం స్థానిక గార్గేయపురం డంప్ యార్డులోని శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. శస్త్ర చికిత్స గదులు, శునకాల బోను వంటి సౌకర్యాలను తనిఖీ చేశారు. నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్న నవోదయ సొసైటీకి అనుమతులు ఇచ్చేందుకు ఆమె అంగీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. వీధికుక్కల బెడద నివారించేలా త్వరలోనే సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. ప్రతిరోజు పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు 20 శునకాలకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. నగరంలో ఇప్పటికే 10,054 వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహించామని, మరో 4 వేల కుక్కలకు ఆపరేషన్లు చేయాల్సి ఉందన్నారు. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

కేసీ శివారెడ్డి సేవలు చిరస్మరణీయం



శివారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, కళాకారులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ కళాకారుడు కేసీ శివారెడ్డి కళారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. బుధవారం కళావాహిని సంస్థ ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కేసీ శివారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరమహంస నాట్య కళా సంస్థను స్థాపించి తద్వారా బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, కేవీ రాఘవరావు, బీసీ కృష్ణ లాంటి ప్రముఖ కళాకారులను పరిచయం చేసిన ఘనత కేసీ శివారెడ్డికి దక్కుతుందన్నారు. అనంతరం పలు పౌరాణిక నాటకాల్లోని పాత్రలను కళాకారులు పోషించి అలరించారు. నారద, కర్ణ పాత్రలను తిరుపాలు, రోశన్న ఏకపాత్రాభినయం చేశారు. చింతామణి, భవాని పాత్రలను లక్ష్మణరాజు, శారదాబాయి పోషించి అలరించారు. కళావాహిని సంస్థ అధ్యక్షుడు మనోహర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాకారులు, గాయకులు చంద్రశేఖర్, పి.దస్తగిరి, సుధారాణి, రమేష్, గజేంద్రనాథరెడ్డి, ధనుంజయ, శివారెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం



టౌన్‌ప్లానర్ ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: నగర పరిధిలోని గుత్తి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వ్యాపారాలు చేసుకుంటున్న వారికి అండగా ఉంటామని కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. టెండర్ దక్కించుకున్న వారి ప్రోద్బలంతో బుధవారం మున్సిపాలిటీ అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిరు వ్యాపారుల తోపుడు బండ్లు, వస్తువులను చిందరవందర చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్లు అక్కడకు చేరుకుని వ్యాపారుల తోపుడు బండ్లను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుత్తి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రెండు ఓ వైపు కారు పార్కింగ్, మరోవైపు మోటార్ సైకిళ్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసి టెండర్ పిలిచారన్నారు. గతంలో టెండర్లు దక్కించుకున్న వారు అక్కడి చిరు వ్యాపారులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక చిరు వ్యాపారులను బెదరించి ఖాళీ చేయించాలని చూడగా కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. అయితే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనే సాకుతో ప్రస్తుతం చిరు వ్యాపారులను ఖాళీ చేయించాలని చూడడం తగదన్నారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. రోజు వారి ఆదాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కూరగాయలు, పండ్లు తదితర చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు, టెండర్‌దారులు దౌర్జన్యం సరికాదన్నారు. అధికారులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

చిరు వ్యాపారులపై దౌర్జన్యం తగదు



వ్యాపారులతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: స్థానిక గుత్తి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై అధికార పార్టీ నాయకులు దౌర్జన్యం చేయడం తగదని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, నాయకులు సుధాకరప్ప, ఏసు అన్నారు. బుధవారం మధ్యాహ్నం చిరు వ్యాపారులపై దాడికి నిరసనగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు మున్సిపాలిటీ ఉద్యోగుల సహకరంతో చిరు వ్యాపారులపై దౌర్జన్యం చేయడం హేయమైన చర్య అన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, వ్యాపారుల తోపుడు బండ్లను తొలగించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సీఐటీయూ నాయకులు అక్బర్, లక్ష్మయ్య, స్థానిక చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, అధ్యాపకులు

కర్నూలు(హాస్పిటల్): స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని జిల్లాస్థాయి ఇంటర్ కాలేజియేట్ వివిధ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, కళాశాల కల్చరల్ అండ్ లిటరరీ యాక్టివిటీస్ కమిటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా హాజరయ్యారు. వ్యాసరచన పోటీల్లో 1.ఎస్.ఖాజా(సిల్వర్‌జూబ్లీ కాలేజీ), 2.షేక్ ఇఫ్రాథ్ నాజ్ (ఉస్మానియా మహిళా డిగ్రీ కళాశాల), 3.బి.రమేష్ (సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల), వక్తృత్వ పోటీలో 1.జి.తనీషా, 2.డి.సత్యగౌతమి (సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల), 3.ఎస్.ఖాజా (సిల్వర్‌జూబ్లీ కళాశాల), క్విజ్ పోటీలో 1.ఉషారాణి (ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల), 2.వి.లక్ష్మీప్రసన్న, 3.కె.చైతన్య (సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల), డిబేట్ పోటీలో 1.వి.మనోజ్ఞ (సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల), 2.ఎస్.నూర్జహాన్ (ఉస్మానియా మహిళా డిగ్రీ కళాశాల), 3.షరాఫ్ సాత్విక (సిల్వర్‌జూబ్లీ కళాశాల), కన్సోలేషన్ ప్రైజ్ ఎస్.అఫియా బహుమతులను గెలుచుకున్నారు. కమిటీ చైర్మన్ ఆశ పర్వీన్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, శ్రీనివాస సింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

11న శ్రీరామ శోభాయాత్ర



శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 11వ తేదీ శ్రీరాముల వారి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న, గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. బుధవారం ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో శోభాయాత్రకు సంబంధించిన బ్యానర్లను పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, సమితి సభ్యులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు లలితా పీఠంలో శ్రీరామ నామ జపం జరుగుతుందన్నారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, పూల బజార్, మించిన్ బజార్, కొండిరెడ్డి బురుజు, గోశాల, రాజ్‌విహార్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు శోభాయాత్ర సాగుతుందన్నారు. అన్ని ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందు అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల అభ్యున్నతికై ఎస్ఎఫ్ఐ కృషి చేయాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. బుధవారం వర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కృష్ణారెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య విశ్వనాథరెడ్డి, పరీక్షల డీన్ ఆచార్య సుందరానంద్, పరీక్షల నిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు, లైబ్రరీ ఇన్‌చార్జ్ నాగభూషణంతో కలిసి ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, కో-కన్వీనర్ మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



క్రీడాకారుడు షేక్షావలిని అభినందిస్తున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపులోని కర్నూలు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ బీకాం విద్యార్థి షేక్షావలి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 4వ తేదీ పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పనూరు గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 8 కిలోమీటర్ల రన్నింగ్ విభాగంలో రెండవ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన ఈ విద్యార్థి ఈ నెల 12వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆర్మీ గోల్ఫ్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు 28వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ బీఎస్.ప్రసాద్ వెల్లడించారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని అభినందించారు.

హెచ్‌ఎంపీ వైరస్‌తో జాగ్రత్త

కర్నూలు(హాస్పిటల్): హెచ్‌ఎంపీ వైరస్ పట్ల చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ పీడియాట్రిషియన్ డాక్టర్ ఆర్.మురార్జీ, పల్మనాలజిస్టు డాక్టర్ కమ్మర వినోద్ ఆచారి సూచించారు. బుధవారం మెడికవర్ హాస్పిటల్‌లో హెచ్‌ఎంపీ వైరస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ వైరస్ సోకికన వారికి దగ్గు, జ్వరం, ముక్కు నుంచి ద్రవం కారడం, గొంతునొప్పి వంటి సాధారణ లక్షణాలు ఉంటాయన్నారు. న్యూమోనియా, రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. వైరస్ నుంచి రక్షణకు చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని, దగ్గు, తుమ్మినప్పుడు ముక్కు, నోటిని కవర్ చేసుకోవాలని, రద్దీ ప్రదేశాలకు వెళ్లే సమయంలో మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన సీపీఐ రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న పి.రామకృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్): అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇంటిని నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఆరో రోజు దీక్షలను జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏ.ప్రతాపరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి 2 సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని మాట ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత హామీపై మాట్లడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అలాగే కర్నూలు నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు కొత్తబస్టాండ్, హాస్పిటల్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. హంద్రీ నీరు ఇళ్లలోకి రాకుండా రక్షణ గోడను ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీఎస్సీ, జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు వస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డీఎస్సీ, జాబ్ క్యాలెండర్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పెట్టిన మొదటి ఐదు సంతకాల్లో 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశం ఒక్కటన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా డీఎస్సీ నోటిఫికేషనే విడుదల కాలేదన్నారు. అలాంటప్పుడు మొదటి సంతకానికి విలువ ఏమి ఉంటుందని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి అయినా ఇస్తామని ప్రకటించారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఒక్కో నిరుద్యోగికి నెలకు రూ.5 వేల ఇవ్వాలన్నారు. వెంటనే గ్రూప్స్, పోలీసు, ఇతర జాబ్‌లకు సంబంధించి క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. దీనిపై మంత్రి లోకేష్ స్పష్టమైన హామీ ఇవ్వాలని, తర్వాతే కర్నూలు జిల్లాలో పర్యటించాలన్నారు.

రెండేళ్ల బాలుడికి కిడ్నీ ఫెయిల్



బాలుడితో డాక్టర్ వై.మనోజ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఆ బాలునికి రెండేళ్ల వయస్సులోనే కడుపు మొత్తం ఒకవైపు ఉబ్బిపోయి, తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఒక కిడ్నీ పూర్తిగా పనిచేయకుండా పోవడంతో పాటు అసాధారణంగా పెరిగిపోవడం వల్లే ఈ సమస్య ఏర్పడింది. ఈ కిడ్నీని కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ల్యాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా విజయవంతంగా తొలగించారు. ఈ చికిత్స వివరాలను యురాలజిస్టు డాక్టర్ వై.మనోజ్‌కుమార్ బుధవారం వెల్లడించారు. కర్నూలుకు చెందిన రెండేళ్ల బాలునికి గర్భస్థ శిశువుగా ఉండగానే ఈ సమస్య ఉంది. అతని ఎడమ కిడ్నీ పనిచేయడం లేదు. దానికితోడు సాధారణంగా రెండేళ్ల వయసులో కిడ్నీ పరిమాణం 4 నాలుగు సెంటిమీటర్లకు బదులు 20 సెం.మీ స్థాయికి చేరుకుంది. అది మూత్రనాళాన్ని కూడా నొక్కేయడంతో అవి మూసుకుపోయాయి. దాని వల్ల నీరంతా పొట్టలోకి చేరి పొట్ట ఒకవైపు ఉబ్బిపోయి, బాలునికి కడుపునొప్పి తీవ్రంగా వచ్చేది. అతని తల్లిదండ్రులు బాలుడిని కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకురాగా వైద్యులు అన్ని పరీక్షలు చేసి ఇటీవల ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో కిడ్నీని తొలగించారు. ఉన్న ఒక కిడ్నీ బాగా పనిచేస్తుండటంతో బాలుడు కోలుకోవడంతో రెండో రోజే డిశ్చార్జ్ చేశారు.

గర్భిణుల ఆరోగ్య వివరాలన్నీ నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణుల ఆరోగ్యంపై సమస్త సమాచారం మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో హైరిస్క్ గర్భిణుల ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, ట్రాకింగ్‌పై పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వార్డు/గ్రామ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు (మూడవ బ్యాచ్) బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ.. గర్భిణులను 8 వారాలలోపు గుర్తించి వివరాలు నమోదు చేసుకుని, నాలుగు సార్లు ఆరోగ్య పరీక్షలు చేసి వారిలో రక్తపోటు, మధుమేహం, కిడ్నీవ్యాధులు, క్షయ, గుండెజబ్బులు, మూర్ఛ, హెపటైటిస్-బి, మలేరియా జ్వరం, గతంలో గర్భం కోల్పోవడం, కవలపిల్లలు, ప్రసూతికి సంబంధించిన శస్త్ర చికిత్స తదితర హైరిస్క్ గల ప్రతి గర్భిణి ఆరోగ్య చరిత్ర తెలుసుకుని ఎంసీహెచ్ కార్డులో నమోదు చేయాలన్నారు. ఈ వివరాలను వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి సమయానుసారంగా ఉన్నత శ్రేణి ఆసుపత్రులకు రెఫర్ చేసి అవసరమైన ఆరోగ్య సేవలు అందేలా చూడాలన్నారు. అంతేగాక శిశువులకు పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకు సమయానుసారంగా ఇవ్వాల్సిన వ్యాధినిరోధక టీకాలను అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో వంద శాతం అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం గర్భిణుల్లో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే అంచనా వేసి క్షేత్రస్థాయి నుంచి రెఫర్ చేసి స్పెషలిస్టు వైద్యుల స్థాయి వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రాష్ట్రస్థాయి శిక్షకులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ అనుదీప్తి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ కె.అన్నపూర్ణ, స్టేట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రశాంత్, డెమో శ్రీనివాసులు, ఎస్‌ఓ హేమసుందరం, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, పీహెచ్‌ఎన్ మీనాక్షి, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాస మూర్తి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కర్నూలు (రూరల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బీకే వెంకటేశులు సూచించారు. మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పెషల్ ఆఫీసర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు సమర్పించిన అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులో రైతుల నుంచి మొత్తం 14 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ జయన్న, వీఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

మండల పరిధిలోని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత డిసెంబర్ 6 నుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. ఈ సదస్సుల్లో మ్యూటేషన్, సర్వే, సవరణ, ఇంటి పట్టాలు, పొలం రస్తా సమస్యలు, భూ వివాదాలు, ల్యాండ్ కన్వర్షన్ తదితర సమస్యలపై రైతుల నుంచి 459 అర్జీలు అందాయని డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు.